## రాజతరంగిణి కథ




"తమ అనంతరం కాశ్మీర సామ్రాజ్యలక్ష్మి ఎవ్వరికి కైవసం కాగలదో అని బాలాదిత్య సార్వభౌముల అంతర్యంలో ప్రబలమయిన జిజ్ఞాస చెలరేగుతున్నది! మీ ఇరువురిలోను ఎవ్వరయినా ఈ విషయం సావకాశంగా పర్యాలోచించి నిస్సందేహంగా నిర్ణయించి చెప్పగలరా?"

వృద్ధమంత్రి దేవశర్మ నెమ్మదిగా లేచి నిలిచి, కొలువు కూటంలో కూరుచున్న జ్యోతిషవిద్వాంసుల నిద్దరిని సూటిగా ప్రశ్నించాడు. దానితో వారిద్దరు వేళ్లతో నిమేషాలు లెక్కిస్తూ దీర్ఘాలోచనలో పడ్డారు. ఆ ఇరువురిలోను నాగేశ్వరభట్టారకుడు కాశ్మీరాస్థాన జ్యోతిషవిద్వాంసుడు. రెండవవాడు మేధావి. నాగేశ్వర భట్టారకుడు ఆ ప్రశ్న ఎందుకు పుట్టిందో క్షణంలో గ్రహించుకున్నాడు. పదహారేళ్ల ప్రాయంలో, బాలాదిత్య చక్రవర్తి ఒకేఒక కుమారుని శరీరంలో ఇటీవల ప్రమాదకరమయిన క్షయరుగ్మత ప్రవేశించి పీడిస్తున్నది. చక్రవర్తి తీవ్ర జిజ్ఞాస కది ఒక్కటే ప్రధాన కారణం. అదే ఆందోళనవల్ల జ్యోతిషంలో కాశ్మీరంలో అంతట విశేషంగా పేరుప్రతిష్ఠలు గడించుకున్న మేధావి నానాడు ప్రత్యేకించి కొలువు కూటానికి పిలిపించడం జరిగిందనికూడా నాగేశ్వర భట్టారకుడు పసికట్టివేశాడు. కనక బాగా జాగ్రత్తపడి మెలకువతో వ్యవహరించకపోతే ముమ్ముందు తన పదవికే ముప్పు రావచ్చునని భయపడ్డాడు.

మరికొన్ని నిమేషాలపాటు తీవ్రంగా ఆలోచించి, రవంత తటపటాయిస్తూ లేచి నిలిచి, సమక్షంలో స్వర్ణసింహాసనంపై సమాసీనుడయిన చక్రవర్తి నుద్దేశించి అత్యంత వినయంతో శిర స్సల్లన వంచి విన్నవించాడు.

"సార్వభౌమా, నే నిటీవల తిరిగి తమ జాతక చక్రము, యువసార్వభౌముల జాతకకుండలి నిశితంగా పరిశీలించాను. ఎన్నెన్ని విధాల పరీక్షించినా, ఆ రెండు జాతకాలలోను ఎక్కడ నా కిటువంటి జిజ్ఞాసకే ఆస్కారం కనబడడంలేదు. నే నిదే విషయం తమ కింతకుమునుపే నివేదించుకున్నాను. అంతకన్న నే నిప్పుడు ప్రత్యేకించి విన్నవించదగినదేది లేదని మనవి."

రెండవ జ్యోతిర్విద్వాంసుడు మేధావి నాగేశ్వర భట్టారకునికన్న వయస్సులో బాగా చిన్న. అయినా నిర్భయంగా లేచి నిలిచి దేవశర్మ నుద్దేశించి ఖంగుమని మారుమోగుతున్న కంఠస్వరంతో ప్రసంగించాడు.

"మహావిద్వాంసులు నాగేశ్వరభట్టారకులు సార్వభౌముల ప్రశ్నమీద అంత నిష్కర్షగా, నిస్సందేహంగా సెలవిచ్చిన పిమ్మట వారి జోస్యానికి కేవలం వ్యతిరేకంగా విన్నవించడం సభామర్యాద కాదేమోనని సంకోచిస్తున్నాను."

"దానికేమి? 'ముఖే ముఖే సరస్వతి' అన్నారు పెద్దలు! మీకు తోచిన ఫలితమేదో ప్రభువర్యుల సమక్షంలో నిస్సంకోచంగా వెల్లడించవచ్చును!"

వృద్ధమంత్రి నాగేశ్వరభట్టారకునివైపు ఓరగా చూచి మేధావి కెంతో ధైర్యం కలిగించాడు. ఆ భరవసాతో అతడు నిర్భయంగా నొక్కి వక్కాణించాడు.

"ప్రాచీనకాలంనుంచి గోనందవంశీయుల భుజస్కంధాలపై సుఖంగా విశ్రమించిన కాశ్మీర సామ్రాజ్యలక్ష్మి ఇక సార్వభౌముల అనంతరం తప్పక వేరొక రాజవంశీయుల కైవసం కాగలదు! చక్రవర్తి జాతక చక్రము, యువసార్వభౌముల జాతకకుండలి క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట నాకు మరి తిరుగులేనట్లుగా గోచరించిన దిది. ప్రభువర్యుల కెంతో అప్రియమయినా, ఈ భవిష్యద్వాణి ఉన్నది ఉన్నట్లుగా వెల్లడించక తప్పకపోయినందుకు నన్ను విశేషించి మన్నించవలసిందని వేడుకుంటున్నాను."

ఆ ప్రసంగంతో కొలువుకూటం యావత్తు ఒక్కమారుగా పిడుగు మొత్తినట్టు నిర్ఘాంతపడింది! చక్రవర్తి కిరువైపుల నిలిచి వింజామరలు వీస్తున్న చామరగ్రాహిణుల హస్తా లొక్కమారుగా నిమేషకాలం నిలిచిపోయాయి. అప్పటికే పశ్చిమాద్రివైపు తిరిగిన సూర్యదేవుని బంగారుకిరణా లా చామరాలపై నిలిచి తళతళ మెరిశాయి.

ఆ ప్రకారంగా తన జోస్యాని కడ్డుచెప్పిన మేధావిపై నాగేశ్వరభట్టారకుని కెంతయినా ఆగ్రహం కలిగింది. రెండు మూడు క్షణాలపాటు అతని కిక ఊపిరే ఆడలేదు! అయినా అతి కష్టంమీద ఆ క్రోధావేశం నిగ్రహించుకుని ఉప్పొంగుతున్న అక్కస్సుతో అతని జ్యోతిష ఫలితంమీద చంద్రునిప్పులే చెరిగిపోశాడు.

"ఇదిగో, తిరిగి నా జ్యోతిష ఫలితం నే నింకొక్కమారు నిష్కర్షగా విన్నవించుకుంటున్నాను. సార్వభౌముల అనంతరం తప్పక యువసార్వభౌములే కాశ్మీరాధీశ్వరులై చిరకాలం జేగీయమానంగా పరిపాలించగలరు! ఒకవేళ నా జోస్యం తప్పినపక్షంలో వెనువెంటనే నే నీ ఆస్థాన పండితపదవి విసర్జించి, ఇదిగో, ఈ నా రతనాల గండపెండేరం స్వయంగా మేధావి విద్వాంసుల పాదాని కలంకరించి, సాష్టాంగ నమస్కారం సమర్పించగలను!"

**పి. గణపతిశాస్త్రి**

తన జోస్యం సకృత్తుగా ఎప్పుడయినా ఒకప్పుడు తప్పుతున్న సంగతి నాగేశ్వరభట్టారకునికి తెలియక పోలేదు. అందుచేత అతని కిప్పుడు తాను చెప్పిన ఫలితం ఒకవేళ తప్పితే తప్పవచ్చునేమో అన్న అనుమానం కలగకపోలేదు. ఏది ఏమయినా ఎప్పుడో బాలాదిత్య చక్రవర్తి అనంతరకాలంలో జరగబోయే సంఘటన మీద, తన నిలికకనిష్టమయిన పద్ధతిలో ఫలితం చెప్ప కూడదని నాగేశ్వరభట్టారకుడు నిర్ణయించుకున్నాడు. కనక మరింత అహంకారావేశంతో అదే ఫలితం నిష్కర్షగా వెల్లడిస్తూ, మొత్తంమీద కాశ్మీరాస్థానంలో తన ఉనికిమీదనే పెద్ద పందెం వేసి గట్టిగా గొంతెత్తి గర్జించాడు.

ఆ హుంకరింపుతో మేధావి బాగా ఇరుకులో పడిపోయాడు. అయినా ఆవంతయినా చలించలేదు.

"సార్వభౌమా! నా భవిష్యద్వాణి తప్పక ఫలించి తీరుతుంది! దీని కిక తిరుగు లేదు! ఇచ్చకంకోసం మంచి ఫలితం చెప్పి మర్యాదగా బయటపడడం నా కెన్నడు అలవాటు లేదు! కేవలం నిశితమయిన శాస్త్ర

వేడుకున్నాడు. ఆ మరునాడే మరి ఎవ్వరికి తెలియకుండా తన కుటుంబంతోపాటు వారణాసికి తరలిపోయాడు.

బాలాదిత్యుని కటువిమ్మట గోనందవంశం తనతో విచ్ఛిన్నమయిపోగలదని, మేధావి చెప్పిన జోస్యం ఫలించగలదేమో అని విపరీతమయిన అనుమానం కలిగింది. కాని అంతమాత్రంచేత ఆతడధైర్యపడలేదు. తన శక్తిసామర్థ్యాలన్నీ వినియోగించి ఆ ఫలితం తన కనుకూలంగా మలుచుకునితీరాలని నిశ్చయించుకున్నాడు. మహామహులు కొందరు తమ జాతక ఫలితాలు మార్చుకోగలిగినప్పుడు తానుమాత్రం ఆవిధంగా ఎందుకు ప్రయత్నించకూడదని అతని కొక దృఢనిశ్చయం కలిగింది. కాని కుమారుని మృత్యుముఖంనుండి సంరక్షించుకోలేకపోయినందువల్ల తన ప్రయత్నా లెంతవరకు ఫలించగలవో అని చక్రవర్తి అంతర్యంలో కొంత సందేహం కలగకపోలేదు. కాని అచంచల దీక్షతో తన సంకల్పం నెరవేర్చుకునితీరాలని నిశ్చయించుకున్నాడు.

సార్వభౌముని ఏకైక పుత్రిక అనంగలేఖ కప్పటికి పద్దెనిమిదివిళ్ళు నిండి, పందొమ్మిదవ ఏడు దాటిపోవచ్చింది. ఆమె నెవరయినా రాజవంశీయునికిగాని, క్షత్రియునికిగాని ఇచ్చి వివాహం చేసినపక్షంలో, తన కిక వేరు సంతతి లేకపోవడంవల్ల, అతడే కాశ్మీరానికి ఉత్తరాధికారి కాగలడు. దానితో తన గోనందవంశం విచ్ఛిన్నమయిపోగలదు. అందువల్ల బాలాదిత్య చక్రవర్తి రాజవంశీయునికిగాని, ఒట్టచివరికి క్షత్రియునికిగాని అనంగలేఖ నిచ్చి వివాహం చెయ్యదలుచుకోలేదు.

అస్పైన తన బంధువులలో ఎక్కడనయినా అన్వేషించి, గోనందవంశీయుడయిన కుమారుణ్ణి ఎవరినయినా దత్తపుత్రుడుగా స్వీకరించాలనికూడా నిర్ణయించుకున్నాడు.

ఆ విధంగా దత్తపుత్రస్వీకారం పట్టమహిషికిగాని, రాజబంధువులకుగాని బొత్తిగా రుచించలేదు. అనంగలేఖ నెవ్వరికయినా ఇరుగు పొరుగు రాజవంశీయునికిచ్చి, చక్రవర్తి అనంతరం సామ్రాజ్యాధికారం యావత్తు అతనికే కైవసమయ్యేటట్టు ఏర్పాటు చెయ్యాలని పట్టపురాణి సంకల్పించుకున్నది. గోనందవంశం చక్రవర్తితో విచ్ఛిన్నమయితేమాత్రం వచ్చే ప్రమాద మేమిఉన్నది? దైవసంకల్పమే ఆ విధంగా మలుపు తిరుగుతున్నప్పుడు మానవమాత్రు లేమి చెయ్యగలరని ఆమె ఆలోచన.

కాని తనతో గోనందవంశం పరిసమాప్తమయిపోవడం బాలాదిత్యుని కెంతమాత్రము నచ్చలేదు. 'ఏది ఏమయినాసరే, అనంగలేఖ నెవ్వరికయినా సాధారణ వ్యక్తి కిచ్చి వివాహం చేసితీరాలి! గోనందవంశంలో జన్మించిన జ్ఞాతి నెవ్వరినయినా దత్తపుత్రుడుగా స్వీకరించి తీరాలి! మేధావి జోస్యానికి, దానితోబాటు దైవానికి ఎదురొడ్డి నిలిచి దానిని వమ్ముచేసితీరాలి!' బాలాదిత్యుని సంకల్పా లా విధంగా కొనసాగిపోయాయి.

ఆ ప్రాచీనకాలంలో కాశ్మీరంలో వర్ణాంతర వివాహాలంత విడ్డూరాలుగా ఎవ్వరు భావించలేదు! అంతకుముందు క్షత్రియవంశంలో జన్మించని మహిళలు కొందరు కాశ్మీర పట్టమహిషు లయినారు. వారికి జన్మించిన కుమారులే కాశ్మీర సామ్రాజ్యాని కుత్తరాధికారు లయినారు. అదేవిధంగా కాశ్మీర రాజ కన్యకలను కొందరినంతకుముందు క్షత్రియులు కానివారి కిచ్చి వివాహాలు జరిపించడంకూడా జరిగింది. అయితే అటువంటి సంఘటన లెప్పుడో సకృత్తుగాగాని జరగలేదు. అందువల్ల రాజబంధువులకుగాని, పట్టమహిషికిగాని ఆ నిర్ణయ మేమాత్రము ఆనందదాయకం కాలేదు. కాని కాశ్మీర సార్వభౌముని సంకల్పానికి అడ్డుచెప్పడానికెవ్వరికి గుండెలువ్నాయి!

అందుచేత మరి తిరుగులేని దృఢనిశ్చయంతో దుర్లభవర్ధనుడన్న ఒక ప్రముఖ రాజోద్యోగికి తన కుమార్తె నిచ్చి వివాహం జరిపించాలని చక్రవర్తి నిశ్చయించుకున్నాడు. ఆ ఉద్యోగి శ్రీనగరంలో అశ్వఘాసశాఖ కంతటికి అధిపతి. అశ్వఘాస శాఖ అంటే కాశ్మీర సైన్యంలో మేలిజాతి గుర్రాలకు పసిరిపచ్చిక చిట్టలతోబాటు మిగిలిన ఆహారపదార్థాలు సమకూర్చే వ్యవస్థ. దుర్లభవర్ధనుడు దాని కంతటికీ అధిపతి. అయినా చక్రవర్తితో సరిపోల్చినప్పుడు అతడు పట్టి నిర్ధనుడే అవాలి. అయినా రాజు తలుచుకుంటే దెబ్బలకే కాదు, ఐశ్వర్యాని కేమి కొదవ! వేగులవారి పరిశీలనవల్ల ఆతడు రాజవంశీయుడుకాని, సక్షత్రియుడుగాని కాడని సుస్పష్టంగా తేలిపోయింది. పైగా ఆతడొక జాతి కాయస్థుడు. ఆకాలంలో ఆదాయ వ్యయాల లెక్కలు వ్రాసే కొందరు లేఖకులకు కాయస్థులన్న పేరేర్పడింది.

> సిఫారసు
>
> మంచి ముఖమే ఉత్తమమైన సిఫారసు పత్రం.
>
> —ఎలిజబెత్ రాణి I

పైగా అత డంతగా ఉత్తమ కులీనుడుకూడా కాడు. కనుకనే చక్రవర్తి కన్ను అతనిపై పడింది.

సార్వభౌముని కతనిపై ఆదరాభిమానాలు కలగడానికి ఇంకా ఒకటి రెండు సుగుణాలు కూడా కలిసివచ్చాయి. దుర్లభవర్ధనుడు మిక్కిలి బలిష్ఠశరీరుడు. అంతేకాదు, అత డెంతో అందగాడు! అనంగలేఖ మిక్కిలి సౌందర్యవతి. ఆ కారణంవల్ల దుర్లభవర్ధనునితో వివాహానికి ఆమె కొంత ఉవ్విళ్ళూరుతున్నదని చక్రవర్తి గ్రహించుకున్నాడు. కనక అతనికే తన కుమార్తె నిచ్చి వివాహం చెయ్యాలనికూడా సంకల్పించుకున్నాడు. కాని అతడు క్షత్రియవంశీయుడుకూడా కాకపోవడం వల్ల పట్టమహిషి కాతనిపై ఏమాత్రము సుముఖత కలగలేదు. కాని కాదుకూడదని సార్వభౌముడంతగా భీష్మించుకుని కూర్చున్నప్పుడు పట్టపురాణిమాత్రం ఏమి చెయ్యగలదు? అనంగలేఖ ఆంతర్యం గ్రహించి, పోనీ గుడ్డిలో మెల్ల అనుకుని ఆ వివాహానికి అర్ధాంగీకారం వెల్లడించింది. మరికొన్ని దివసాలలోనే అనంగలేఖా దుర్లభవర్ధనుల కిరువురికి దేవేంద్ర వైభవంతో యథావిధిగా కల్యాణ మహోత్సవం జరిగిపోయింది.

ఇక బాలాదిత్యుని మనస్సులో ఒకే ఒక సంకల్పం మిగిలిపోయింది. అది దత్తపుత్రస్వీకరణ. దాని విషయమై ఆత డొక్క నిమేషమయినా ఆలసించ దలుచుకోలేదు. చారు లనేకులవల్ల సునిశిత పరిశీలన జరిపించి, ఒక గోనందవంశ బంధువు కుమారుడు శాత్రవకేసరిని దత్తపుత్రుడుగా స్వీకరించి సామ్రాజ్యాని కుత్తరాధికారిగా యువసార్వభౌమ పదవిలో అభిషేకించవలెనని సంకల్పించుకున్నాడు. అతనికప్పటికింకా ఇరవై ఏళ్ల ప్రాయమయినా నిండలేదు. అయినా అనేక యుద్ధాలలో మహాపరాక్రమశాలి అన్న ఘన బిరుదం గడించుకున్నాడు. అందువల్ల తన అనంతరం కాశ్మీర సామ్రాజ్యం చెక్కుచెదరకుండా సంరక్షించగలడన్న గట్టి ధైర్యం కాశ్మీర చక్రవర్తి హృదయంలో స్థిరపడింది.

అయితే దత్తస్వీకార శుభముహూర్తం నిర్ణయించే వరకు ఆ వ్యవహారం బంధువులకేకాక, చిట్టచివరికి తన కెంతో ఆత్మీయుడు వృద్ధమంత్రి దేవశర్మకు కూడా తెలియనియ్యరాదని చక్రవర్తి కొక ఆలోచన కలిగింది. అప్పటి కతనికి తన దృఢసంకల్పంతో, నిరంతర ప్రయత్న శక్తితో, పౌరుష ప్రాభవంతో ఆ దైవానికే ఎదురొడ్డి నిలిచి జేగీయమానంగా జయించగలిగానన్న సంపూర్ణ సంతృప్తి కలిగింది. ఆపైన మరికొన్నాళ్ళలోనే మేధావిని తన కొలువుకూటానికి పిలిపించి అతడు చెప్పిన జోస్యం పూర్తిగా తప్పిపోయినదని కప్పించి, ఓటమి ఒప్పించాలనికూడా ఉత్కంఠ కలిగింది.

## 3

ఆ విధంగా స్వశక్తివల్ల గోనందవంశం నిరంతరాయంగా తామరతంపరగా వర్ధిల్లడానికి ప్రయత్నించి చాలావరకు విజయం సాధించినా, చక్రవర్తి అంతరాంతరంలో ఎక్కడో కొంచెం సంశయం పట్టుకుని కలుక్కుమని వేధించకపోలేదు. అదే మథనతో ఆ మరునాడే మేధావిని తన కొలువుకూటానికి పిలిపించాడు.

బాలాదిత్య చక్రవర్తి కలకల నవ్వుతున్న ముఖంతో ఆనాటి సభామందిరంలో ప్రవేశించగానే దేవశర్మతోబాటు మేధావి దిగ్గున లేచి నిలిచి సార్వభౌముని కత్యంత వినయంతో నమస్కరించి దోసిలికట్టి నిలుచున్నాడు. ఆతని ముఖవైఖరి పూర్తిగా ఓటమి అంగీకరిస్తున్నట్టు న్నదని సార్వభౌమ దేవశర్మ లిరువురికి క్షణంలో స్ఫురించింది. ఆటువిమ్మట వృద్ధమంత్రి నెమ్మదిగా లేచి నిలిచి, మేధావివైపు చూచి, రవంత వెటకారంగా నవ్వి అధిక్షేప గర్భిత స్వరంతో ప్రశ్నించాడు.

"రాకుమారి అనంగలేఖాదేవి కల్యాణమహోత్సవానికి విచ్చేసి మీరు సార్వభౌముల సగౌరవ బహూకృతి అందుకున్నారు గదా! ఇక చక్రవర్తి త్వరలోనే గోనందవంశీయుడయిన ఒక దత్తపుత్రుణ్ణి స్వీకరించి, యువరాజ పట్టాభిషేకం జరిపించవలెనని నిశ్చయించుకున్నారు. దాని కిక శుభముహూర్త నిర్ణయం ఒక్కటే తరవాయి. మరి మీరు సార్వభౌముల అనంతరం సామ్రాజ్యం వేరొక రాజవంశీయుల కైవసం కాగలదని అన్నారే! మరి చక్రవర్తి జామాత దుర్లభవర్ధనులు సక్షత్రియ వంశీయులుకూడా కాదుగదా? మీ జోస్యం పూర్తిగా తప్పిపోయినట్టే కదా? ఇప్పుడేమంటారు?"

ఆ ప్రశ్నతో సార్వభౌముని కిరువైపుల నిలిచి వింజామరలు వీస్తున్న చామరగ్రాహిణుల కిరువురికి ముచ్చెమటలు పోశాయి! వారి కరకంకణాల మనోజ్ఞ రవం క్షణకాలం మందగించింది. వింజామరల వేగం రవంత క్షీణించింది. ఇక మేధావి కేదో గొప్ప అవమానం జరగగలదని వారిద్దరు మిక్కిలి ఆందోళనపడ్డారు.

కాని ఆతని ముఖంలో ఎక్కడ పరాజయచ్ఛాయ

కానరాలేదు! పైగా గాంభీర్యంతో మేళవించిన అహంకారావేశం హుమ్మని హుంకరించింది. అయినా అతి కష్టంమీద తెచ్చిపెట్టుకున్న అడకువతో కాశ్మీరాధిపతికి దోసలికట్టి విన్నవించాడు.

"మహాప్రభూ! ఇంతవరకు దైవశక్తి కెదురొడ్డి నిలిచి కేవలం పౌరుషశక్తితోనే ప్రయత్నించి తా మనేక విధాల కృతకృత్యు లయినారు! కాదనడంలేదు! రాకుమారిని ఒక సామాన్యుని కిచ్చి వివాహం జరిపించి, ఆపైన గోనందవంశీయుని కొకనికి దత్తపుత్ర గౌరవం ప్రసాదించవలెనని సంకల్పించుకున్నారు. అయితే ఇక ముమ్ముందు జరగబోయేదిమాత్రం మీ చేదోయినుండి ఇంతకుమునుపే దాటిపోయింది!"

"అంటే?"

ప్రశ్నించాడు దేవశర్మ నిలువునా నిర్ఘాంతపడి. అదే క్షణంలో చక్రవర్తి నుదుటిపై తీవ్రమయిన బొమముడి విరిగింది. మేధావి సార్వభౌమునివైపు చూచి మంద్ర గభీర స్వరంతో తానన్న మాటల కంతరార్థం వివరించాడు.

"తామనుకున్నట్టు దుర్లభవర్ధనులు కేవలం కాయస్థ కులస్థులు కానేకారు! వారి గృహంలో శయన మందిరంలో ఆగ్నేయదిశలో నిలువులోతున బంగారు కలశంలో ఒక నిధి ఉన్నది! వేయిన్నూటపదారు బంగారు నాణాలతోబాటు రాగిరేకులపై వారి వంశ వృక్ష పట్టిక సవిస్తరంగా దానిలో లిఖించబడి ఉన్నది! దానినిబట్టి ఆయన సుప్రసిద్ధ కర్కోటక నాగ వంశీయులేకాక, సుక్షత్రియ కులీనులనికూడా సుస్పష్టం కాగలదు! ఇదేక్షణంలో అచ్చటి కెవ్వరినయినా పంపించి, ఆ నిధి వెలువరింపజేసి, ఆ వంశవృక్ష పట్టిక తామే స్వయంగా పరిశీలించవచ్చును. నా ఈ మాట తప్పిపోయినఎడల తా మెటువంటి శిక్ష విధించినా నేను శిరసావహించగలను!"

ఆ ప్రతిసమాధానంతో బాలాదిత్యుని శిరస్సుపై పెనుపిడుగు విరుచుకుపడినట్టయింది! అయినా నిగ్రహించుకున్నాడు. మేధావి గభీర కంఠస్వరాన్ని బట్టి అతని భవిష్యద్వాణి అక్షరాల ఫలించగలదన్న నమ్మికకూడా చక్రవర్తి కప్పటికి కలిగింది. వెనువెంటనే రాజదూత నొకణ్ణి పంపించి, "ఆ పాతు శీఘ్రంగా వెలువరింపజేయించి తన సన్నిధికి పంపించవలసిన" దని దుర్లభవర్ధనుని కాదేశించాడు. అయినా చక్రవర్తికి తన ప్రయత్నంపై విశ్వాసం సడలలేదు. తిరిగి మేధావిని పరీక్షించాడు.

"అయితే మేము దత్తులుగా ఎన్నుకున్న రాజకుమారుని పేరేమో చెప్పగలరా?"

మేధావి అయిదారు నిమిషాలపా టాలోచించి వేళ్ళు మడిచాడు.

"శాత్రవకేసరి!"

చక్రవర్తి ఆత్మధైర్యానికి ఆ ప్రత్యుత్తరంతో తీవ్రమయిన ఆఘాతం తగిలింది! 'తన కొక్కనికి మాత్రమే తెలిసిన ఆ గోనందవంశీయుని పేరు మేధావి కెలాగ అవగతమయినదా?' అని క్షణకాలం దిగ్భ్రాంతుడయినాడు. అయినా అచంచల ధైర్యంతో తన దృఢదీక్ష వెల్లడించాడు.

"ఇన్నివిధాల మీ జోస్యం ఫలిస్తున్నా, నే నెలాగయినా దైవంతో పోరాడాలనే నిశ్చయించుకున్నాను. త్వరలోనే నేను శాత్రవకేసరికే యువరాజ పట్టాభిషేకం జరిపించితీరగలను! ఈ నిర్ణయానికి మరి తిరుగు లేదు!"

మేధావి కంఠస్వరం తిరిగి ఖంగుమని మారుమోగింది.

"కాశ్మీరాధీశ్వరా! ఈ వ్యవహారంలోకూడా మీ నిర్ణయమే తప్పక ఫలించగలదు. ఇంతేకాదు, మీరు జీవించిఉన్నంతకాలము కాశ్మీరం మీ గోనందవంశం చల్లని ఏలుబడిలోనే వర్ధిల్లగలదు! కాని అటు పిమ్మట కర్కోటక నాగవంశీయులు దుర్లభవర్ధనులే సామ్రాజ్యాధికారులు కాగలరు! మీ అనంతరం కొంత కాలం సామ్రాజ్యంలో ఏర్పడిన అల్లకల్లోలాలవల్ల శాత్రవకేసరి సింహాసనంపై పట్టాభిషిక్తులు కాకుండానే పరాజితులై దూరదూరంగా తొలగిపోగలరు! ఇది ముమ్మాటికి యథార్థమై అక్షరాల జరిగితీర గలదు!"

ఆ ప్రసంగంతో బాలాదిత్య సార్వభౌమునికి నాలుగయిదు క్షణాలవరకు మరి ఊపిరే ఆడలేదు. అయినా రవంతసే పాలోచించి కలకల నవ్వి ప్రశ్నించాడు.

"అయితే నే నిప్పు డేమని ఆలోచిస్తున్నాను?"

"నా భవిష్యద్వాణి నెలాగయినా తప్పిపోయేటట్టు



చూపానక ...
ఫోటో—బి. ప్రసాదరెడ్డి (హైదరాబాదు)

చెయ్యాలని దృఢంగా నిశ్చయించుకున్నారు! అదే ఆలోచనతో త్వరలోనే శాత్రవకేసరిని యువరాజపదవిలో అభిషేకించితీరాలని నిశ్చయించుకున్నారు!"

చక్రవర్తి కా ప్రత్యుత్తరం పరమాశ్చర్యం కలిగించింది. 'సరిగా నే నాలోచిస్తున్నది ఎలాగ తెలిసింది మేధావికి?' అని తనలో తా నాశ్చర్యపడ్డాడు! అయినా తిరిగి పరీక్షించాడు.

"మీ ఫలితం యథార్థమే! అయితే తిరిగి నే నీ క్షణంలో ఏమని ఆలోచిస్తున్నాను?"

"చక్రవర్తీ! ఇప్పటికి నా జ్యోతిషంమీద మీకు కొంత గట్టి నమ్మకమే కలిగింది! కనకనే నన్ను మీ ఆస్థాన జ్యోతిషవిద్వాంసుడుగా నియమించవలెనని ఆలోచిస్తున్నారు. కాని వారణాసికి పోయిన నాగేశ్వర భట్టారకులను తిరిగి పిలిపించి మీ ఆస్థాన విద్వాంసులుగా గౌరవించవలసిందని నా ప్రార్థన."

"మరి మీ మాట?"

తటాలున దేవశర్మ కల్పించుకుని ప్రశ్నించాడు.

"నన్ను దుర్లభవర్ధనులు తమ ఆస్థాన విద్వాంసులుగా నియమించుకోగలరు! నేను జ్యోతిష శాస్త్రానికి గౌరవం కలిగించడంకోసమే తమ దర్శనం చేసుకున్నాను. అదిగాక నా జాతక ఫలితంకూడా ముమ్మందే యోగదాయకంగా ఉన్నది. కనక నా కోరిక మన్నించవలసిందని ప్రార్థన."

ఆ సమాధానంతో చక్రవర్తికి మేధావిపై ఇనుమిక్కిలిగా గౌరవం కలిగింది. అంతలోనే దుర్లభవర్ధనుని భవనంలోనుండి నిధి వెలువరించిన రాజదూత ఆతని వంశవృక్ష పట్టికతో, బంగారు కలశంతో, వేయిన్నూటపదారు పైడిదీనారాలతో చక్రవర్తి సమక్షానికి వచ్చి అవి సవినయంగా సమర్పించాడు. ఆ వంశవృక్ష పట్టిక మేధావి జోస్యం అక్షరాల యథార్థమని ఋజువుపరిచింది.

దానితో బాలాదిత్య సార్వభౌమునికి మేధావి భవిష్యద్వాణి తప్పక ఫలించితీరగలదన్న దృఢ నిశ్చయం కలిగింది. అందుచేత అతని ప్రార్థన ప్రకారం నాగేశ్వరభట్టారకుని తిరిగి తన ఆస్థాన విద్వాంసుడుగా నియమించడాని కంగీకరించాడు. అయితే మేధావిని శ్రీనగరంలో స్థిరపడిపోవలసిందని సగౌరవంగా ప్రార్థించాడు. ఆ విద్వాంసునికి దాని కంగీకరించక తప్పలేదు. అంతలోనే బాలాదిత్య సార్వభౌముని కంఠం మేఘ గంభీరస్వరంతో ప్రతిధ్వనించింది.

"ఇన్ని ప్రబల నిదర్శనాలు గోచరించిన పిమ్మట మీ జ్యోతిషవిద్యా పాటవం కాదనగల శక్తి నాకు లేదు! అయినా మానవులు తమ భవిష్యత్తు మలుచుకోవడంలో సర్వ స్వతంత్రులని మీరే అన్నారు కదా! కాని దైవశక్తి తోడ్పాటు లేనప్పుడు మానవ ప్రయత్నం ఫలించకపోవచ్చునికూడా నాకు తెలియకపోలేదు. ఇలాగే పురుషప్రయత్నం లేనప్పుడు దైవం ఎంతగా ప్రబలమయినా తోడ్పడజాలదు. కనక మీ జ్యోతిషం మీద నా కెంతటి గౌరవం కలిగినా, ఈ మాసంలోనే శాత్రవకేసరిని దత్తపుత్రుడుగా స్వీకరించి యువరాజ పట్టాభిషేకం జరిపిస్తున్నాను."

మేధావి ముఖం దరహాసితంతో కలకలలాడింది.

"సార్వభౌమా! ఇలాగ జరిగి తీరగలదని నే నిదివరకే విన్నవించాను గదా! ఇది జ్యోతిషశాస్త్రానికే అఖండ విజయమని భావిస్తున్నాను. అదిన్నీగాక అంతా దైవ నిర్ణయమే అని చేతులు ముడుచుకుని కూర్చోవలసిందని జ్యోతిషశాస్త్ర మెన్నడు ఆదేశించలేదు. అయితే ఫల సిద్ధికి దైవానుకూల్యం సూచించే గ్రహానుకూలత కూడా ఉండాలనిమాత్రమే నిర్దేశించింది. ఇందుచేత ఈ నిర్ణయంలో మీ మేరుధీరత కిదే నా నమస్కృతి! సర్వదా మీకు శుభం చేకూరవలెనని, నా జోస్యం ఫలింపజెయ్యవలసిందని మనసారా ఆ గ్రహాధిపతి ఆదిత్య దేవునికి నమస్కరిస్తున్నాను."

మరికొంతసేపటికి ఆ సమావేశం ముగిసింది.

మేధావి జోస్యం ఫలించితీరగలదని త్రికరణశుద్ధిగా విశ్వసించినా, బాలాదిత్య సార్వభౌముడు పురుష ప్రయత్నంపై అంతకన్న ఇనుమడించిన నమ్మికతో అదే మాసంలో శాత్రవకేసరిని దత్తకుమారుడుగా స్వీకరించాడు.

యువరాజ పట్టాభిషేక మహోత్సవంలో కాశ్మీరానికి తిరిగి పిలిపించిన నాగేశ్వరభట్టారకు డాదిగా గల జ్యోతిషశాస్త్ర విద్వాంసుల సమక్షంలో మేధావిని స్వయంగా నిర్వర్తించిన స్వర్ణదీనారాల అభిషేకంతో గౌరవించి తన పరిపూర్ణౌదార్యం వ్యక్తీకరించాడు. ★